ప్రమోషన్లలో ఎస్టీలకు రిజర్వేషన్లు అమలు చేయాలి

ప్రభుత్వ ఉద్యోగులైన ఎస్టీలకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు సజావుగా అమలు చేయాలని జాతీయ ఎస్టీ కమిషన్ వైస్ చైర్మన్ అనంతనాయక్‌కు డాక్టర్ ఆనంద్ విజ్ఞప్తి చేశారు. శనివారం ఢిల్లీలో కమిషన్ వైస్ చైర్మన్‌ను బంజారా మహిళా సొసైటీ వ్యవస్థాపకుడు డాక్టర్ ఆనంద్ కలిసి గిరిజన ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై విన్నవించారు. గిరిజనులపై జరుగుతున్న దాడులను అరికట్టే విధంగా సరైన చర్యలు తీసుకోవాలని వినతి పత్రాన్ని అందజేశారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఎల్బీనగర్, ఫిబ్రవరి 10 :సరూర్‌నగర్ చెరువులో గర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. మృతుడి ఒంటిపై బ్లూ రంగు టీ షర్ట్, బూడిద రంగు నైట్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. శవాన్ని ఎవరైనా గుర్తిస్తే సరూర్‌నగర్ పోలీసులను సంప్రదించాలని 8712662337 కోరారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మతతత్వ విధానాలపై ప్రతిఘటిద్దాం

- దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి
- సీఐటీయూ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నర్సిరెడ్డి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కీసర నర్సిరెడ్డి

మన్సూరాబాద్, ఫిబ్రవరి 10: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మతతత్వ విధానాలను ప్రతిఘటించేందుకు ఈనెల 16న నిర్వహించనున్న సమ్మెను విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై ఆటోనగర్‌లోని మెకానికల్, టెక్నికల్ అసోసియేషన్ కార్యాలయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. అదే విధంగా సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మతతత్వ విధానాలను ప్రతిఘటిద్దాం.. మోదీ ప్రభుత్వ వైఫల్యాలపై ఫర్ సీట్ కట్టిద్దాం అనే నినాదంతో దేశవ్యాప్త కార్మికుల సమ్మెను, భారత్ గ్రామీణ బంద్‌ను నిర్వహిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు కీసర నర్సిరెడ్డి తెలిపారు. సమ్మె విజయవంతం కోసం ఈనెల 14న ఆటోనగర్ నుంచి ఎల్బీనగర్ వరకు బైకు ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వలన పేదలు మరింత పేదలుగా మారుతున్నారని తెలిపారు. మోదీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మెలో అన్ని కార్మిక సంఘాలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరయ్య, సామిడి శేఖర్‌రెడ్డి, శంకర్‌నాయక్, లింగంగౌడ్, కృష్ణయ్య, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

భారత్ బంద్‌ను జయప్రదం చేయాలి



కందుకూరులో కరపత్రాలను పంచుతూ ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

కందుకూరు. ఫిబ్రవరి 10 : కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు రాంచందర్ తెలిపారు.మండల కేంద్రంలో ఈ నెల 16న దేశ వ్యాప్తంగా నిర్వహించనున్న గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ మండలంలో కరపత్ర ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు అంకగాల్ల కుమార్‌తో కలిసి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 సంవత్సరాలు అయిన ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను మరిచిపోయిందన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ దేశ వ్యాప్త సమ్మెను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతుల నల్ల చట్టాలకు వ్యతిరేకంగా 14నెలలు ఢిల్లీలో వీరోచిత పోరాటం రేసి రైతుల వ్యతిరేక చట్టాలను తిప్పికొట్టిన ఘనత రైతులదని అన్నారు. తిరిగి నరేంద్ర మోదీ ప్రభుత్వం మళ్లీ ఆ చట్టాలను తీసుకురావడానికి ప్రయత్నం చేస్తున్నట్లు పేర్కొన్నారు. కులం, మతం పేరుతో కేంద్ర ప్రభుత్వం హిందూ మతోన్మాదాన్ని పెంచి పోషిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు శ్రీనివాస్, శేఖర్ గుప్త, సత్తయ్య పాల్గొన్నారు.

నల్లగొండ సభను విజయవంతం చేయాలి

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, మాధవరం నర్సింహారావు

వనస్థలిపురం, ఫిబ్రవరి 10 : నల్లగొండలో ఈ నెల 13న నిర్వహించనున్న బీఆర్ఎస్ బహిరంగ సభను జయప్రదం చేయాలని బీఆర్ఎస్ యూత్ జిల్లా ఇన్‌చార్జి మాధవరం నర్సింహారావు కోరారు. సభ కోసం రూపొందించిన పోస్టర్‌ను శనివారం మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా నర్సింహారావు మాట్లాడుతూ అరచేతిలో వైకుంఠం చూపేలా వాగ్దానాలు చేసిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత చేతులెత్తేసిందన్నారు. ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చలేక గత ప్రభుత్వాన్ని బదనాం చేసేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ప్రజలంతా దీనిపై ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. లక్షలాదిగా ప్రజలు నల్లగొండకు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాజీ అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఒంటేరు ప్రతాప్‌రెడ్డి, పాశం శ్రీధర్, వెంకట్‌రెడ్డి, నాగార్జున గౌడ్, ప్రశాంత్ రెడ్డి, శ్రీకాంత్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమించిన రోడ్డును పరిరక్షించండి



జీహెచ్ఎంసీ డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కాలనీవాసులు

హయత్‌నగర్, ఫిబ్రవరి 10 : హయత్‌నగర్ డివిజన్‌లోని కృష్ణవేణి దవాఖాన యాజమాన్యం ఆక్రమించిన రోడ్డును పరిరక్షించాలని జీహెచ్ఎంసీ విజిలెన్స్, డయస్టర్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్‌ను వేర్వేరుగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం పలు కాలనీల వాసులు కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ హయత్‌నగర్ బస్ డిపోకు వెళ్లే రోడ్డు పక్కన కృష్ణవేణి ఆస్పత్రి యాజమాన్యం కొంత మేరకు ఆక్రమించారని తెలిపారు. అదే రోడ్డులో రెండు ఆర్టీసీ బస్ డిపోలు, కోర్టు, కళాశాల, దాదాపు 14 కాలనీలకు ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారని వివరించారు. ప్రధాన రోడ్డును కొంత మేరకు కృష్ణవేణి ఆస్పత్రి యాజమాన్యం ఆక్రమించడం వల్ల నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని తెలిపారు. దీనిపై డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి, కమిషనర్ రోనాల్డ్ రోస్ సానుకూలంగా స్పందించారని వెల్లడించారు. అధికారుల నుంచి నివేదిక తెప్పించుకుని తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

పడకేసిన పారిశుధ్యం

రహదారులపై పేరుకుపోతున్న చెత్త ■ పట్టించుకోని అధికారులు

లెనిన్ నగర్ ప్రధాన రహదారిపై దర్శన మిస్తున్న చెత్త కుప్పలు

బడంగ్‌పేట, ఫిబ్రవరి10: మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ లో పారిశుధ్యం పడకేసింది. ప్రధాన రహదారులపై చెత్త పేరుకుపోయినే అధికారులు పట్టించు కోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బాలాపూర్ చౌరస్తా నుంచి బడంగ్‌పేట కమాన్ వరకు చెత్త కుప్పలు దర్శన మిస్తున్నాయి. కాలనీలలో చెత్త సమస్య గురించి ఇక చెప్పనవసరం లేదంటున్నారు. కాలనీలలో మ్యాన్ హోల్స్ లేకున్నా, డ్రైనేజీ పొంగి రోడ్ల పై పారుతున్న ఎవరు పట్టించు కోవడం లేదని ఫిర్యాదులు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. చెత్త తొలగించక పోవడంతో దోమలు, ఈగలు, పందులకు నిలయాలుగా మారుతున్నాయి. దీంతో కాలనీలలో ప్రజలకు అనేక రకాల వ్యాధులు వస్తున్నాయని కాలనీ వాసులు వాపోతున్నారు. చికెన్ గున్యా, మలేరియా, డెంగీ వంటి వ్యాధులు వస్తున్నా ఎవరు పట్టించు కోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కాలనీలలో ఉన్న చెత్త సమస్య ఏమోగాని ప్రధాన రహదారులపై ఉన్న చెత్తను తొలగించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

ప్రతిభను వెలికితీసేందుకే విజ్ఞాన ప్రదర్శనలు

విద్యార్థులు తయారు చేసిన వివిధ నమూనాలను పరిశీలిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

ఆర్కేపురం, ఫిబ్రవరి 10 : విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి విజ్ఞాన ప్రదర్శన ఎంతోగాను ఉపయోగపడుతుందని లోటస్ ల్యాప్ పబ్లిక్ పాఠశాల డైరెక్టర్ కడారి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం సరూర్‌నగర్ డివిజన్ హుడా కాంప్లెక్స్‌లోని లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్‌లో అంతరిక్ష 2024 విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చంద్రశేఖర్‌రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి విజ్ఞాన సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విజ్ఞన సదస్సు అనగా సైన్స్ సాంకేతిక రంగాలకు సంబంధించినటువంటి మోడల్స్‌ను చూపించమే కాకుండా విద్యార్థుల్లోని నైపుణ్యతను మెరుగుపరుచుకోవడానికి ఎంతగానో తోడ్పడుతుందన్నారు. భవిష్యత్తులో ఒక లీడర్‌గా ఎదగడానికి వేదికలపైన భయాలు లేకుండా ఉండడానికి ఇలాంటి కార్యక్రమాలు ధైర్యాన్ని ఇస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ హెడ్ లలితరెడ్డి, ప్రిన్సిపాల్ శేషు, ఫణి, కవిత, గీత, అనిత తదితరులు ఉన్నారు.

పీవీకి భారతరత్న తెలుగువారికి గర్వకారణం

పీవీ నరసింహారావు విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న దేప భాస్కర్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి

ఆర్కేపురం, ఫిబ్రవరి 10 : ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని అభివృద్ధి పథం వైపు పరుగులు తీయించిన గొప్ప దార్శనికుడు మాజీ ప్రధాని దివంగత పీవీ నరసింహారావు అని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ పీసీసీ మెంబర్ దేప భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర యువజన నాయకుడు ఉపేందర్‌రెడ్డి అన్నారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న అవార్డు ప్రకటించిన సందర్భంగా శనివారం అల్కాపురి చౌరస్తాలోని పీవీ నరసింహారావు విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ముద్దు బిడ్డ పీవీకి భారతరత్న ప్రకటించడం యావత్ తెలంగాణ గర్వించదగ్గ విషయమని తెలిపారు. దేశ రాజకీయాల్లో ఉన్న వ్యక్తులకు పీవీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ మాజీ అధ్యక్షుడు పున్న గణేశ్‌నేత, బండి మధుసూదన్‌రావు, నల్లేంకి ధన్‌రాజ్‌గౌడ్, వెంకటేశ్వర్లు, తలాటి రమేశ్‌నేత, గట్ల రవీంద్ర, మహిందర్, జ్ఞానేశ్వర్ యాదవ్, రాజునాయక్, భాస్కర్‌నాయక్ తదితరులు ఉన్నారు.

పేదబిడ్డల పెండ్లిళ్లకు ఉప్పల ఫౌండేషన్ చేయూత

కానుకలు అందజేస్తున్న రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త

మన్సూరాబాద్, ఫిబ్రవరి 10: రెండు కుటుంబాల్లో జరుగుతున్న పేదింటి ఆడబిడ్డ పెండ్లిళ్లకు ఉప్పల ఫౌండేషన్ చేయూతనిచ్చింది. కూకట్‌పల్లి, ఆల్విన్‌కాలనీకి చెందిన కల్వ శోభారాణి, అంజన్‌కుమార్ దంపతుల కుమార్తె ప్రసన్నలక్ష్మి వివాహం, గౌలిపురకి చెందిన ధర్మేంద్రప్రసాద్, కవితల కూతురు నవనీత వివాహాలు ఇటీవల నిశ్చయమయ్యాయి. రెండు కుటుంబాల ఆర్థిక పరిస్థితిపై కొందరు వ్యక్తులు తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన స్పందించి నాగోల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వేర్వేరుగా రెండు కుటుంబాల్లో జరుగుతున్న వివాహాలకు గాను పుస్తె, మట్టెలు, చీర, గాజులను అందజేశారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్‌గుప్త మాట్లాడుతూ ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇరవై ఐదు సంవత్సరాలుగా పేద కుటుంబాల్లో జరుగుతున్న వివాహాలకు.. నిరుపేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రవికుమార్ గుప్త, నాగరాజు గుప్త, శ్రీధర్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

సరూర్‌నగర్ చెరువులో వ్యర్థాల తొలగింపు

వ్యర్థాలను తొలగించే పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రేం మహేశ్వర్‌రెడ్డి

ఎల్బీనగర్, ఫిబ్రవరి 10 : సరూర్‌నగర్ చెరువులో వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేం మహేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం ఎంటమాలజీ విభాగానికి చెందిన 40 మంది కార్మికులతో కలిసి సరూర్‌నగర్ చెరువులో వ్యర్థాల క్లీనింగ్ కార్యక్రమాన్ని కార్పొరేటర్ బద్దం ప్రేం మహేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరూర్‌నగర్ చెరువు చుట్టూ జాలీ ఏర్పాటు చేసి చెత్తను అందులో వేయకుండా చూడాలని కోరారు. చెరువులో వ్యర్థాలతో చెరువునీరు కలుషితమై దోమల బెడద తీవ్రమవుతుందన్నారు. చెరువు సందరీకరణ పనులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజీ ఏఈ రాంబాబు, నాయకులు దాసరి జయప్రకాశ్, చిలుకూరి రాంరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ప్రేంగాంధీ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ గృహజ్యోతి దరఖాస్తుల సర్వే

జైత్వారంలో సర్వే నిర్వహిస్తున్న సర్వే బృందం

కందుకూరు. ఫిబ్రవరి 10 : ప్రజా పాలనలో భాగంగా గృహజ్యోతి పథకానికి వచ్చిన దరఖాస్తులను ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహిస్తున్నామని విద్యుత్ ఏఈ రమేశ్‌గౌడ్ తెలిపారు. అందులో భాగంగా మండల పరిధిలోని 35 గ్రామ పంచాయతీలతో పాటు అనుబంధ గ్రామాల్లో 18వేల ఫైచిలుకు దరఖాస్తులు వచ్చాయని వాటిన్నింటి ఇంటింటికీ వెళ్లి బృందాలుగా ఏర్పడి సర్వే నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అన్ని గామాల్లో వివరాలను సేకరిస్తున్నట్లు వివరించారు. ప్రతి ఇంటికి వచ్చిన బృందం సభ్యులకు రేషన్ కార్డు, విద్యుత్ మీటర్ నంబర్, ఆధార్ కార్డు, దరఖాస్తు వంటి వివరాలను తెలియజేయాలని ప్రజలను కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రతి గ్రామంతో పాటు ఇంటింటికీ వస్తారని తెలిపారు.

17 నుంచి బ్రహ్మోత్సవాలు

మలక్‌పేట : మూసారాంబాగ్ ఎస్‌బీఐ ఆఫీసర్స్ కాలనీలోని కంచి కామకోటి పీఠం పరిధిలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ పంచవింశతి బ్రహ్మోత్సవాలు, శ్రీ పార్వతి అమ్మవారి షోడశ బ్రహ్మోత్సవాలను 17 నుంచి 20 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. 17న అంకురార్పణ, 18న సామూహిక సుప్రభాత సేవతో ప్రారంభమయ్యే ఈ బ్రహ్మోత్సవాల్లో అగ్ని ప్రతిష్ఠాపన, ఈశ్వరుడికి రుద్రాభిషేకం,అన్నాభిషేకం, పార్వతి అమ్మవారికి పంచామృతాభిషేకం, మహావిశ్వశాంతి యజ్ఞం, శ్రీవారిని పెళ్లికుమారుడిని చేయటం, 19న శ్రీవారి కల్యాణోత్సవం, శివపార్వతుల శాంతి కల్యాణం, విష్ణు సహస్రనామ పారాయణం, 20న పూర్ణాహుతి, మహా కుంభాభిషేకం, ఊంజల్ సేవతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయని వారు పేర్కొన్నారు.

నూతన నియామకం

గణేశ్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న నర్సింహ, వత్తుల రాజు, రాజశేఖర్

ఆర్కేపురం, ఫిబ్రవరి 10 : బహుజన సమాజ్ పార్టీ సరూర్‌నగర్ మండల అధ్యక్షుడిగా ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన మస్క గణేశ్ నియమితులయ్యారు. ఈ మేరకు బహుజన సమాజ్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షుడు శ్రీనడ్డి నర్సింహ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గణేశ్ మాట్లాడుతూ సరూర్‌నగర్ మండలంలో బహుజన సమాజ్ పార్టీ బలోపేతానికి అన్ని విధాలుగా కృషి చేస్తానని తెలిపారు. మండలంలో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేసి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. బహుజన సమాజ్ పార్టీతోనే అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతుందన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి వత్తుల రాజు, కందుకూర్ మండల అధ్యక్షుడు రాజశేఖర్, నవీన్, శ్రీనివాజ్, మేడి శ్రీనివాస్, ముటుపు నరేశ్, మస్క రాజు, మురళీ, రాజ్ కుమార్, దాసరి వినయ్ తదితరులు ఉన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తాం

కాస్‌బాగ్ బస్తీలో స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి, అధికారులు

హయత్‌నగర్, ఫిబ్రవరి 10 : హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని కాస్‌బాగ్ హయత్‌నగర్ భూగర్భ డ్రైనేజీ సమస్యను జలమండలి అధికారులు, కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బస్తీల్లో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో తరచుగా డ్రైనేజీ పొంగి స్థానికంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. దాంతో పాటు వేసవి కాలంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కృషిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ రాజు, సూపర్‌వైజర్ బాలు, నాయకులు భాస్కర్, అధ్యక్షుడు ఉగాది ఎల్లప్ప, నాయకులు ఎర్రవెల్లి సత్యనారాయణ, గంగని శ్రీను, లక్ష్మిదాస్, వస్పరి వెంకటేశ్, నర్సింహ, ఎర్ర ప్రేమ్, బస్తీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఇండస్ట్రీస్ సొసైటీ సభ్యులకు న్యాయం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి

సైదాబాద్, ఫిబ్రవరి 10:ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణి కాలనీలో ఇండస్ట్రీస్ డిపార్ట్‌మెంట్ ఎంప్లాయీస్ హౌసింగ్ సొసైటీకి చెందిన భూమిని ప్రభుత్వం సభ్యులకు అప్పగించి న్యాయం చేయాలని సొసైటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి కోరారు. 1981లో సొసైటీ సభ్యులు ప్రభుత్వం నుంచే భూమిని కొనుగోలు చేసిన ఇప్పటికీ నిరాశ్రయులు గానే ఉండిపోయామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం సింగరేణి కాలనీలో సొసైటీ సభ్యులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ఏపీ కో ఆపరేటివ్ యాక్ట్ ప్రకారం 1976లో ఏర్పడిన తమ సొసైటీ 1981లో సైదాబాద్ సింగరేణి కాలనీలోని 25 ఎకరాల భూమిని ప్రభుత్వం నుంచి కొనుగోలు చేసిందన్నారు. 1995లో ప్రభుత్వం సొసైటీ సభ్యులకు నోటరైజ్డ్ డాక్యుమెంట్‌లు ఇచ్చినట్లు తెలిపారు. అదే విధంగా 2009లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం జీవో 727 ప్రకారం సింగరేణి కాలనీలోని 25 ఎకరాల భూమిని సొసైటీకి చెందిన 247 మంది సభ్యులకు ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేయించిందన్నారు. అయితే కాలక్రమేనా ఆ భూమిలో కొందరు పేదలు గుడిసెలు వేసుకున్నారని అన్నారు. ప్రభుత్వంలో చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తూ కొనుగోలు చేసిన భూమిని దక్కించుకోకుండానే తమలో కొంతమంది మృతి చెందారని, చాలా మంది ఉద్యోగాల నుంచి పదవీవిరమణ చేశారని గుర్తు చేశారు. కానీ సొంత ఇండ్లు లేక వృద్ధాప్యంలో అద్దె నివాసాల్లో ఉంటున్నారని వాపోయారు. గుడిసెవాసులకు ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూపించి ఖాళీ చేయించి సొసైటీ సభ్యులకు స్థలాన్ని అప్పగించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో సొసైటీ కన్వీనర్ కె.ఎస్.ఆర్.మూర్తి, అధ్యక్షుడు బాల ప్రసాద్, కో కన్వీనర్ ఉదయ్ చంద్, కోశాధికారి మల్లికార్జున శెట్టి తదితరులు పాల్గొన్నారు.

పూర్తయిన వీడీసీసీ రోడ్డు నిర్మాణం

మలక్‌పేట, ఫిబ్రవరి 10: పాత మలక్‌పేట డివిజన్‌లోని అఫ్జల్‌నగర్ కాలనీ సబ్ స్టేషన్‌వద్ద చేపట్టిన వీడీసీసీ రోడ్డు నిర్మాణం పూర్తయినది. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ రోడ్డు నిర్మాణాన్ని శుక్రవారం రాత్రి పూర్తిచేశారు. మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల ప్రత్యేక చొరవతో రోడ్డును ఆగమేఘాల మీద పూర్తిచేశారు. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న రోడ్డు నిర్మాణంపై కాలనీవాసులు ఎమ్మెల్యే అహ్మద్ బలాలను కలిసి పరిస్థితిని వివరించగా, వెంటనే స్పందించిన ఆయన నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించటంతో నాలుగు రోజులక్రితం నిర్మాణ పనులను ప్రారంభించి శుక్రవారం రాత్రి పూర్తి చేశారు. నిర్మాణ పనులను ఏఈ రఘువీర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణలు దగ్గర ఉండి పర్యవేక్షించారు. కాగా చాలా కాలం తర్వాత రోడ్డు నిర్మాణం జరగటంతో కాలనీవాసులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.